# ప్రగతిపథంలో చైనా

ఇంతకు ముందు షాంఘైహాయ్‌లో కబుర్లు చెప్పుకున్నాం కనుక, ఈసారి పారిశ్రామికంగానూ ఆర్థికంగానూ చైనా ఎంత ఎదిగిందో చూద్దాం.

ఈమధ్య ఆఫీసు పనిమీద చైనాకి రెండు మూడుసార్లు వెళ్ళి, ఎన్నోవారాలుండి ఆ దేశంలో చాలాభాగం చూశాను. వివిధ సంస్కృతులకి చెందిన ప్రదేశాల్ని మనుష్యుల్ని కలిసినప్పుడు, ఆ అవకాశాల్ని వదులుకోకుండా, వాళ్ళతో ఎన్నో విషయాల మీద చర్చలు జరపటం, కొత్త విషయాలు తెలుసుకోవటం, ఆ ప్రదేశాల వెనకవున్న చరిత్ర తెలుసుకోవటం నాకదో సరదా కనుక ప్రొద్దుటినించి రాత్రి దాకా ఆఫీసుపనిలో మునిగిపోయినా ఎంతగా అలసట తెలియలేదు.

చైనాలోని పెద్ద నగరాలయిన బైజింగ్, షాంఘైహాయ్‌లతో పాటు హైనాన్ ప్రావిన్స్ (ఇండియాలో రాష్ట్రాన్ని చైనాలో ప్రావిన్స్ అంటారు) లోని హైకు, శాన్యా, నాన్‌షాన్ అనే వూళ్ళు, షియామెన్, షెంగ్డు, సూఝో, హాంగ్‌ఝు మొదలైన సిటీలు, ఇంకా ఎన్నో చిన్న చిన్న గ్రామాలు చూసే అవకాశం కలిగింది. చాల చోట్లకు విమానాల్లో వెళ్ళినా, ఎన్నో ప్రదేశాలకి కార్లలో వెళ్ళటంవలన, ఆ పల్లెల్ని ప్రజలనీ కొంచెం దగ్గరగా పరిశీలించే అవకాశం దొరికింది.

నిజానికి చైనా సుందరమైన దేశం. ఎంతో చరిత్రవున్న దేశం. ఆ రకరకాల ప్రదేశాలలోని వింతలూ విశేషాలూ తర్వాత చెప్పుకుందాం. ఈసారికి ప్రపంచీకరణ ప్రగతిపథంలో చైనా ఎలా పరుగెడుతున్నదో చూద్దాం.

మొదటిసారి చైనా వెళ్ళినప్పుడు నేను దిగిన మొదటి ప్రదేశమే నన్ను ఆశ్చర్యంలో ముంచివేసింది. నేను వెళ్ళిన ఆ ప్రదేశం పేరు హైనాన్ ప్రావిన్స్‌లోని హైకు. అమెరికాకు హవాయి ఎలాగో, చైనాకి హైనాన్ అలాటి ఎంతో అందమైన ద్వీపం. అక్కడ వున్న బీచ్‌లు, హాలిడే రిసార్టులూ, హోటళ్ళూ తదితర విహార యాత్రా ఆకర్షణలూ చూస్తే, అది నేను విన్న, చదివిన చైనా కాదని వెంటనే తెలిసిపోయింది. ఆధునికచైనా! చైనాని ఇంకో రకంగా చూడాలని అర్థమయిపోయింది. నేటి నవచైనాలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆ ద్వీపం ఒక పెద్ద ఉదాహరణ. అక్కడే కాదు, మరి ఎన్నో చిన్న వూళ్ళల్లో కూడా విమానాశ్రయాలు కట్టేస్తున్నారు. ఒక్కసారిగా నేను విన్నది చదువుకున్నదీ చైనా గిరగిరా గింగిరాలాడుతున్నట్టు అనిపించింది.

షియామెన్‌నుంచి షెంగ్డూ వెళుతున్న విమానం ఆకాశంలోనించి కిందకి దిగటం మొదలు పెట్టగానే, సామానుతో తలుపు దగ్గరకి వెళ్ళిపోతున్నారు కొందరు ప్రయాణీకులు. ఎయిర్‌హోస్టెస్ ఇంకా టైముందనీ కూర్చోమని మర్యాదగా చెప్పిందీ అయినా ఆ మాట వినకుండా అక్కడే నుంచుని చైనీస్‌లో కలకలలాడారు వాళ్ళు. చేసుకుంటున్న ఆ పాసింజర్లని అసహాయంగా చూస్తున్న ఆ అందమైన చైనా హోస్టెస్, అరిచైనా ఏడ్చైనా వాళ్ళని కూర్చోబెట్టగలదా అని అనుమానం వచ్చింది నాకు.

ఇన్నాళ్ళూ చైనా కమ్యూనిస్టు ఇనుప తెర వెనకవున్న కారణంగా అక్కడ

మన దేశ నాయకుల్లో, ఆ ప్రదేశాల్లో ఏ విశేషాలు వున్నాయో ఏమయినా తెలియలేదు. నా చిన్నప్పటి నుంచీ రాయలసీమలో చదువు, ఎంతో ప్రేమించిన కమ్యూనిజం అంతకన్నా ఎక్కువైన ప్రేమ అద్భుత ప్రజల దృష్టిలో కమ్యూనిజం చాలవరకూ చచ్చిపోయింది. 52 సంవత్సరాల, అంటే 1949 అక్టోబర్ ఒకటిన ప్రారంభమైన, కొత్త చైనా స్వాతంత్ర్యంగా ఉత్సవాలు 1999లో స్వర్ణోత్సవాలు కూడా జరుపుకుంది. 1976లో మావో మరణించిన తరువాత, చైనా కొత్త నాయకత్వంలో ముందుచూపుతో ముందుకే నడిచింది. 1978లో మిగతా దేశాల నుంచీ, పరిశ్రమల ఏర్పాటుకి అక్కడ డబ్బు పెట్టుబడిని ఆహ్వానించటం మొదలుపెట్టింది. 1990లో సోవియట్ యూనియన్ పడిపోయాక, చైనా ఇంకా విజృంభించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ 80వ వార్షికోత్సవం రోజున, ప్రెసిడెంట్ జియాంగ్ జెమిన్ పాతబడ్డ మార్క్సిస్టు కమ్యూనిజానికి తిలోదకాలు ఇచ్చాడు. ఆర్థికంగా ముందుకు వెళ్ళగలిగితే, రాజకీయపరంగా ప్రపంచంలో శక్తివంతమైన స్థానం లభిస్తుందని చెప్పాడు. ఆ కార్యసాధన కోసం, పెట్టుబడిదారి దేశాలతో చేయి కలిపాడు. చైనా ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వం పొందటమూ, ఎక్కువ శక్తి సంపాదించటం, ప్రపంచ వాణిజ్యసంస్థలో సభ్యత్వం సంపాదించటంలాంటివి రాజకీయంగా ఎంతో లాభించినా, అన్నిటికన్నా ముఖ్యమైన విజయం పన్నెండేళ్ళలో ప్రపంచ పారిశ్రామిక రంగంలో ముందు బెంచీలోకి రావటం.

ఇటువంటివైనా అనుకున్నా, ఎటువంటి చూసినా చైనా ఆర్థికంగా చాల ముందుకి వెళ్ళిపోయింది. ఇప్పుడు చైనాలో విదేశ పెట్టుబడులు పదకొండు వేల కోట్ల రూపాయలను దాటాయని అంచనా. అమెరికన్ ట్రేడ్ డెఫిసిట్ ఇప్పుడు ఇంతకుముందులా జపాన్ తో కన్నా ఎక్కువగా చైనాతో వుండటంలో ఆశ్చర్యం లేదు. అమెరికాలో హాలీ పెన్నులూ కప్పుల దగ్గరినుంచీ టీవీలూ, కంప్యూటర్లూ, స్టీరియోలూ, డిజిటల్ కెమేరాలూ కూడా చైనానుంచే వస్తున్నాయి. అంతేకాదు ఎన్నాళ్ళనుంచో విరోధులుగా వున్న చైనా జపానులు ఈ రోజున వ్యాపార పదరంగంలో ముఖ్యమైన పాత్రులు. పానాసానిక్, హిటాచీ, సోనీలాంటి అన్ని జపాను కంపెనీలు ప్రపంచ మార్కెట్ కోసం వస్తువులను తయారు చేస్తున్నాయక్కడ. జర్మనీ ఓక్స్‌వాగన్, ఔడీ కార్లను, జపాన్ కార్ల భాగాలను చైనాలోనే తయారుచేస్తున్నారు. జనరల్ ఎలక్ట్రిక్ రిఫ్రిజిరేటర్లూ వాషర్లూ డ్రైయ్యర్లూ మాత్రమే కాక విమానం ఇంజన్ భాగాలను కూడా చైనాలోనే తయారు చేస్తున్నది. అలాగే మిగతా రెండు విమానం ఇంజన్లు తయారుచేసే కంపెనీలు రోల్స్‌రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ కూడాను. బోయింగ్, ఎయిర్ బస్ విమాన భాగాలను చైనాలోనే తయారు చేస్తున్నారు. పెద్ద పెద్ద అమెరికన్, యూరోపియన్, జపనీస్ కంపెనీలు, వాళ్ళ ప్రాడక్టులను చైనాలో తయారుచేస్తున్నారు. నాలాంటి ఇంజనీర్లు, చైనాకి వారాల నెలల తరబడి వెళ్ళటం అందుకే.

అయితే చైనా ఎందుకలా ముందుకి పోతున్నది? అంత తొందరగా ఒక పారిశ్రామిక సూపర్ పవర్‌గా ఎలా తయారయింది? వాటి గురించి నేను చూసిన, చదివిన, తెలుసుకున్న విషయాలు చెబుతాను.

ముఖ్యంగా నాకు కనపడ్డవి మూడు కారణాలు. ఒకటి అక్కడ కేంద్ర

ప్రభుత్వం ఇకనింపైనా చైనా మిగతా దేశాలకన్నా ముందుగా, మొదటి స్థానంలో వుండాలని గొప్ప పట్టుదలతో వుంటే, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చైనాలో తాము మొదటి స్థానంలో వుండాలని పోటీ పడుతున్నాయి. సూఝో, హాంగ్‌ఝులాటి పట్టణాల్లో పెద్ద పెద్ద ఇండస్ట్రియల్ పార్కులు నెలకొలిపి, విదేశాలనించ ఎన్నో బిలియన్ల డాలర్ల పెట్టుబడి తెచ్చుకోగలిగాయి. ఏ విదేశీ కంపెనీ అక్కడికివచ్చి పెట్టుబడి పెడదామనుకున్నా, ఆ ప్రావిన్స్‌లలోని గవర్నమెంట్ అధికారులు ముందుకు వచ్చి వాళ్ళ చేయి పట్టుకు నడిపిస్తున్నారు. మా బృందానికి కూడా అలాటి ఆతిథ్యమే లభించింది. ఇంతటి పట్టుదలా కమిట్‌మెంట్ ఒక ముఖ్య కారణం. అక్కడా ఇక్కడా కొంత లంచాల వ్యవహారంవుందని విన్నాం కానీ, లంచాలు తీసుకునేవాళ్ళనీ, ఇచ్చే వాళ్ళనీ అక్కడ శిక్షించే విధానం చూస్తే మటుకు ఎవరికీ లంచం తీసుకునే ధైర్యం వుంటుందని అనుకోను.

రెండవది వారి ఉత్పత్తి చౌక లేబర్ రేటు. చైనా అటు కమ్యూనిజంలోనూ ఇటు పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ వున్న మంచిని తీసుకుని చెడును వదిలేస్తున్నదని పించింది. ఎందుకంటే అక్కడ స్ట్రైకులూ బందులూవుండవు. కమ్యూనిస్టు పద్ధతి ప్రకారం అలాటివి నిషేధం. ఈ మల్టీ నేషనల్ కంపెనీలలో జీతాలు ఎక్కువ అవటంవల్ల అక్కడి ఉత్పత్తి అమెరికన్ ప్రొడక్టివిటీకి దగ్గరగా వస్తున్నది. బెస్ట్ ఆఫ్ బోత్ వరల్డ్స్ అంటే ఇదేనేమో. అదీకాక చాలమంది చైనీయులు స్వభావరీత్యా తెలివైనవాళ్ళు, గొప్ప నాణ్యమైన పనితనం కలవారు. అదేకాక "పనిచేయటం తెలియటానికీ", "పనిచేయటానికీ" బేధా తెలిసిన కష్టజీవులు. చైనాలో ఇప్పుడు దావైనా దోవైనా పనిచేసే రోజులు పోయాయి. ప్రపంచ వాణిజ్యరంగంలో చాల ముందున వుంది కనుక, అక్కడే వుండాలని గట్టి పట్టుదల వుంది కనుక, నాణ్యత ధరల మీదే దృష్టి కేంద్రీకరించింది.

మూడవది ఏ పరిశ్రమ పెట్టుకోవటానికయినా అవసరమైన పరిస్థితులు, అదే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని, చాల త్వరితంగా తయారుచేసుకున్నది చైనా. ఎక్కడికి వెళ్ళినా కొత్తగా వేసిన రోడ్లు, లేక వేస్తున్న రోడ్లు కనిపిస్తూవుంటాయి. రోడ్లంటే మామూలు రోడ్లు కాదు. ఫ్రీవేలు. ఎక్స్‌ప్రెస్ వేలు. హైవేలు. అవే దేశ ప్రగతికి పదివేలు మరి. రోడ్లు సరికొత్తవవటంవల్ల కాబోలు అక్కడి రోడ్లను చూస్తుంటే కొన్నిచోట్ల అమెరికా యూరప్‌ల రోడ్లు ఎందుకూ పనికిరావనిపిస్తుంది. రోడ్లకిరువక్కలా మైళ్ళ పొడుగునా వేసిన పూలమొక్కలు ఎంతోఅందాన్నిస్తున్నాయి. అమెరికాలోని రోడ్ల పద్ధతులని కాపీ కొట్టటమే కాకుండా వాటి మీద ఇంప్రూవ్‌మెంట్ కూడా చేస్తున్నాం అని గర్వంగా చెప్పాడు ఒక కంపెనీ సిఈఓ. అలాగే ప్రతిచోటా సమృద్ధిగా నీళ్ళు, ఎలక్ట్రిసిటీ, నేచురల్ గాస్. ఏ పరిశ్రమ పెట్టాలన్నా వాటికి కొదవలేదు.

"మీరు చైనా మీద బయాస్‌డ్‌గా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. ఇండియాకూడా అలాగే వుంది" అన్నాడు ఒక మిత్రుడు.

"ఇండియా పారిశ్రామికంగా చైనాని మించిపోతే సంతోషించే వాళ్ళల్లో నేనూ ఒకడ్ని. అక్కడ వున్నప్రతిరోజూ, ఆరోజు ఎప్పుడు వస్తుందా అనే నామనసులో ఆలోచన" అన్నాను.